ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

మంగళవారం 19 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ - మంగళవారం

సాయంత్రం - 6.32

సహర్ - బుధవారం

ఉదయం - 4.59



ధారూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



'పది' పరీక్ష... తొలిరోజు ప్రశాంతం

- ఉత్సాహంగా పరీక్ష రాసిన విద్యార్థులు
- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్
- తప్పిదాలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

వికారాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం తొలి రోజు ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 80 పరీక్ష కేంద్రాల్లో 13,462 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 13,395 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు 99.5శాతం మంది పరీక్ష రాశారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 57 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. వన్స్ ఫెయిల్డ్ విద్యార్థులు 52 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 42 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. ప్రతీ గదికి తిరిగి విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఎగ్జామ్ సెంటర్‌లోకి అనుమతించొద్దని ఎగ్జామినర్లకు సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలన్నారు. పక్కవారితో మాట్లాడకుండా విద్యార్థులు ఎవరంతలో వారు పరీక్ష రాసేలా చూడాలని, కాపీయింగ్‌కు పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ఇతర సదుపాయాలన్నీ కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట పరీక్ష కేంద్రం సీఎస్ సునీత, పరిశీలకుడు వినయకుమార్ ఉన్నారు. కాగా, అంతకు ముందు ఇదే కేంద్రాన్ని డీఈవో రేణుకాదేవి తనిఖీ చేశారు.

పట్టణంలో 12 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

వికారాబాద్ : పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. వికారాబాద్ పట్టణంలోని 12 పరీక్ష కేంద్రాల్లో 1,941 మంది విద్యార్థులకు 1,937 హాజరైనట్టు ఎంఈవో బాబుసింగ్ తెలిపారు.

మేడ్చల్ జిల్లాలో 231 కేంద్రాల్లో పరీక్షలు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 231 పరీక్ష కేంద్రాల్లో మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైందని డీఈవో విజయకుమారి తెలిపారు. పరీక్షలో 46,777 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 46,683 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. అదే విధంగా 66 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 45 మంది పరీక్షకు హాజరయ్యారని ఆమె తెలిపారు.



మేడ్చల్ జిల్లా కీసరగుట్టలో...

పరీక్షల నెపంతో విద్యార్థుల పస్తులు

యాలాల: యాలాలలోని ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులు సోమవారం ఆకలి కేకలతో అలమటించారు. యాలాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు హాస్టల్లో ఉంటున్నారు. యాలాల ఎస్సీ, బీసీ బాలికల పాఠశాలల విద్యార్థినులు కూడా యాలాల జడ్పీహెచ్ఎస్‌లోనే చదువుతున్నారు. హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం ఉదయం అల్పాహారం మాత్రమే ఇచ్చారు. మధ్యాహ్నం 12:30 గంటలకు టెన్త్ పరీక్ష పూర్తయిన తర్వాత 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు స్కూల్‌కి వెళ్లారు. అప్పటికి అక్కడ విద్యార్థులకు భోజనం వండలేదు. విద్యార్థులు మధ్యాహ్నం 3గంటల వరకు ఆకలితో అలమటించారు. వంట చేసిన తర్వాత విద్యార్థులకు భోజనం వడ్డించారు. హాస్టల్ వార్డెన్లు, ఉపాధ్యాయులు రోజూ మాదిరిగా భోజనం అందించే ఏర్పాట్లు చేయలేదని విద్యార్థులు అన్నారు.



వికారాబాద్‌లోని జడ్పీహెచ్ఎస్ బాలుర పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



పరిగిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



చేవెళ్ల ఎంపీ టికెట్ తనకు దక్కుతుందా? లేదా? అనే మీమాంసలో వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఉన్నారు. ఆమె చేవెళ్ల టికెట్ ఆశించి ఎంతో ఉత్సాహంతో కుమారుడితో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీ భవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ల సమక్షంలో పార్టీలో చేరారు. ఎంపీగా గెలిచి లోక్‌సభలో అడుగుపెట్టాలని తలంచారు. అయితే హఠాత్తుగా సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో ఆయనకే టికెట్ కేటాయిస్తారనే ప్రచారం జోరందుకుంది. దీంతో మొదట తనకు టికెట్ ఇస్తామని పార్టీలోకి రప్పించుకొని ఇప్పుడు వేరే వ్యక్తిని చేర్చుకోవడంపై ఆమె అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. మల్కాజిగిరి స్థానం నుంచి పోటీకి ఆమె సుముఖంగా లేనట్టు సమాచారం.

కింకర్తవ్యం?

చేవెళ్ల టికెట్ దక్కుతుందో లేదోనని సునీతారెడ్డి నారాజ్!

- రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో మారిన సమీకరణాలు
- సిట్టింగ్ ఎంపీకే టికెట్ అని జోరుగా ప్రచారం
- చేవెళ్ల టికెట్ చేజారిందన్న భావనలో సునీతారెడ్డి
- మల్కాజ్‌గిరి నుంచి పోటీకి మహిళా నేత విముఖత
- రాజకీయ భవిష్యత్తుపై మల్లగుల్లాలు

వికారాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి సన్నద్ధమైన వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డికి చుక్కెదురైంది. చేవెళ్ల ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టాలని ఆశించిన ఆమె ఆకాంక్ష సాకారమయ్యే అవకాశాలు కనిపించడం లేదు. చేవెళ్ల ఎంపీగా పోటీ చేయాలనే లక్ష్యంతోనే సునీతారెడ్డి తన కుమారుడితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. పార్టీలో చేరిన తరువాత పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ తమ వెన్నంటి ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ వైపు తిప్పుకోగలిగారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తమకు మద్దతిచ్చిన నాయకులను చాలామందిని ఆమె ఇప్పటికే కాంగ్రెస్‌లో చేర్పించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సునీతారెడ్డి పోటీ చేస్తారని పార్టీ శ్రేణులూ నిర్ణయించుకున్నాయి. చేవెళ్ల నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసేది తానేనని ధీమాతో ఉన్న సునీతారెడ్డి తనకు టికెట్ కేటాయింపులో అవాంతరాలు ఎదురవుతాయని ఊహించలేకపోయారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో చేవెళ్ల నుంచి పట్నం సునీతారెడ్డి పేరు ఉన్నా.. ఆ తరువాత పార్టీ ప్రకటించిన జాబితాలో చేవెళ్ల అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా సునీతారెడ్డి పేరును తొలి జాబితాలోనే ప్రకటిస్తారని ఆశించిన ఆమె వర్గీయులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తొలి జాబితాలో చేవెళ్ల అభ్యర్థిని ప్రకటించకపోవడంతో రాజకీయంగా ఏదో జరుగుతోందన్న ప్రచారం ఊపందుకుంది. ఆ తరువాత రాజకీయంగా చోటు చేసుకున్న అనూహ్య పరిణామాలతో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంతో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డే అనే విషయం పార్టీ శ్రేణులకు స్పష్టత వచ్చింది. అధికారికంగా ప్రకటించకపోయినా.. కాంగ్రెస్ తరఫున ఎన్నికల బరిలో నిలిచేది ఆయనేనన్న సంకేతాన్నీ పార్టీ ఇచ్చింది. కాంగ్రెస్ తొలి జాబితాలో ఉన్న సునీతారెడ్డి పేరును సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కోసమే తప్పించి చేవెళ్ల అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టారనే చర్చ పార్టీ శ్రేణుల్లో జరుగుతోంది.

చేవెళ్ల నుంచి పోటీ చేసి గెలిచిన పార్లమెంట్‌లో అడుగుపెట్టాలని పట్టుదలతో ఉన్న సునీతారెడ్డి ఆకాంక్షను అనూహ్యంగా చోటుచేసుకున్న పరిణామాలు నీరుగార్చాయి. సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో సునీతారెడ్డి ఆశలకు గండికొట్టినట్టయింది. దీంతో ఆమె తన రాజకీయ భవితవ్యంపై ఆలోచనలో పడ్డారని తెలుస్తోంది. చేవెళ్ల నుంచి ఎంపీ రంజిత్‌రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చి.. సునీతారెడ్డిని మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరక ముందు నుంచే చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో రాజకీయ సమీకరణలను సిద్ధం చేసుకున్న సునీతారెడ్డి.. ఊహించని హఠాత్పరిణామాలను జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. చేవెళ్లకు బదులుగా మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసేలా సునీతారెడ్డిని ఒప్పించే ప్రయత్నాలను పార్టీ నాయకులు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తామని పార్టీ ముఖ్య నేతలు ఆమెకు భరోసా ఇస్తున్నా.. అక్కడి నుంచి పోటీకి సునీతారెడ్డి విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది తన రణక్షేత్రం కాదని, రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచీ తనకు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలతోనే ఎక్కువ అనుబంధం ఉందని, కొత్తగా మల్కాజిగిరిలో పోటీ అంటే రిస్కే అనే అభిప్రాయంలో ఆమె ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై ఆమెతో మాట్లాడేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

డీలాపడ్డ సునీతారెడ్డి.. మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తారా?



సమావేశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

చేవెళ్ల గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

- ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 18 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రకటించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నివాసంలో సోమవారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ముక్తకంఠంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తుందని, ఈ సారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండుసార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుండి పోటీ చేస్తున్నారని ఆ ఇద్దరినీ ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుండి వ్యతిరేకత ఎదుర్కొంటుందని, కేసీఆర్‌ని ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని వారన్నారు. త్వరలో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రతీ ఒక్కరు సహకరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి, యెగ్గె మల్లేశం, దయానంద్ గుప్తా మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, యువనేత కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

'పట్నం'కు పదవి!


- ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి నియామకం
- ఈ నెల 15నే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



తాండూరు, మార్చి 18 : ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వం పదవిని కట్టబెట్టింది. మహేందర్‌రెడ్డిని ప్రభుత్వ చీఫ్‌విప్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జీవో నంబర్ 103ను ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్నికల కోడ్‌కు ముందే ఉత్తర్వులిచ్చినా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. రాజకీయ సమీకరణల్లో భాగంగానే మహేందర్‌రెడ్డికి చీఫ్‌విప్ పదవిచ్చారన్న చర్చ సాగుతోంది. చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ రంజిత్‌రెడ్డి ఖరారయ్యే అవకాశాలున్న నేపథ్యంలో మహేందర్‌రెడ్డికి పదవివ్వడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే మహేందర్‌రెడ్డికి ప్రభుత్వ పదవి ఇచ్చినా ఆయన సతీమణి, వికారాబాద్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సునీతారెడ్డికి మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇవ్వనున్నట్టు సమాచారం!

ప్రచార సభలకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 18: ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు ముందగానే దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకొచ్చిందన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు ప్రచారానికి అనుమతి తీసుకోవాలన్నారు. కనీసం 48గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతొస్తుందని, రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల మధ్య లౌడ్ స్పీకర్లు వాడొద్దన్నారు. ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నంబర్, సి-విజిల్ యాప్ ద్వారా చేయొచ్చన్నారు. పబ్లిక్ ప్లేస్‌లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీల వాల్‌రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను తొలగించాలన్నారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నంబర్, ప్రింట్ చేయించే వారి ఫోన్ నంబర్ ముద్రించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేవంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జడ్పీ సీఈవో సుధీర్, ఆర్డీవో వంశీచంద్ర, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకొచ్చిందని, దానిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 3,200 పోలింగ్ కేంద్రాలున్నాయని, 46 ఆక్జిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. 37,28,417మంది ఓటర్లుండగా వారిలో 15,117 మంది 85ఏళ్లకు పైబడిన వారు, 26,119 మంది దివ్యాంగులున్నారన్నారు. ఆదివారం నుంచే ఎన్నికల వ్యయం లెక్కల్లోకి వచ్చిందని, అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. ఎన్నికల నిర్వహణకు ఎస్ఎస్టీ, వీఎస్టీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఏవైనా ఫిర్యాదులను సి-విజిల్ యాప్ లేదా 1950 నంబర్‌కు తెలియజేయాలన్నారు. అవసరమైన చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. సభలు, సమావేశాలకు సువిధ ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. ఎవరైనా రూ.10లక్షలకు పైగా నగదు తీసుకువెళ్తే ఆదాయ పన్ను శాఖకు అప్పగిస్తామన్నారు. రూ.50వేలకు మించి తీసుకెళ్లే నగదుకు అన్ని ఆధారాలు, రశీదులు ఉండాలన్నారు. అన్ని టీవీ చానళ్లు, వార్తా పత్రికల్లో ప్రభుత్వ పథకాల ప్రకటనలపై నిబంధనలు పాటించాలన్నారు. పోస్టర్లు, కరపత్రాల వివరాలను ప్రచురించిన 3రోజుల్లో జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. సమావేశంలో డీపీఆర్వో అరుంధతి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ

ఎన్నికల నామినేషన్ నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరిస్తామన్నారు. కౌంటింగ్ మాత్రం మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ భోగారంలోని హోలీ మేరీ ఇంజినీరింగ్ కాలేజీ, అలాగే ఎల్‌బీనగర్‌కు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, కంటోన్మెంట్‌కు వెస్లీ కాలేజీలో లెక్కింపు జరుగుతుందని వివరించారు.

ఎంసీఎంసీ సెంటర్ ప్రారంభం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ మీడియా సెంటర్‌ను కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్ ప్రారంభించారు. అనంతరం ఎంసీఎంసీ పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్వో అరుంధతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ నాగాంజలి పాల్గొన్నారు. అనంతరం బ్యాంకర్లతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఖాతాదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి ఖాతాదారులకు తెలియపర్చాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణకు పార్టీల సహకారం అవసరం

ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కలెక్టర్ గౌతమ్ కోరారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల వ్యయ పరిశీలనకు కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఆవరణలు, స్థలాలు, అధికారిక కార్యాలయాలను ప్రచారానికి వాడుకోవద్దన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారుల తీరుపై ఆగ్రహం

దోమ, మార్చి 18: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు సీసీ రోడ్ల నిర్మాణంలో తీర్మానాలు చేయకుండా అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాయం పట్ల వైస్ ఎంపీపీ మల్లేశం, బొంపల్లి ఎంపీటీసీ రాములు పంచాయతీరాజ్ శాఖ అధికారి లక్ష్మయ్య తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దోమ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. మన ఊరు, మన బడి కార్యక్రమంలో పనులు చేపట్టి సంవత్సరం గడుస్తున్నా బిల్లులు అందలేదని అధికారుల తీరుపై ఎంపీటీసీ రాములు మండిపడ్డారు. బొంపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనుల్లో పనులు చేయకుండానే బిల్లులు చేసిన వారిపై లక్ష వరకు రికవరీకి ఆదేశించినా ఇప్పటి వరకు ఎంత రికవరీ చేశారని ఏపీవో దస్తయ్యను నిలదీశారు. గొన్ననాయక్ తండా, పాశంబండ తండా, హేట్యనాయక్ తండాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కాపోవడంతో తండావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైస్ ఎంపీపీ మల్లేశం ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నర్సింహులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో ఎంపీపీ అనసూయ, వైస్ ఎంపీపీ మల్లేశం, ఎంపీడీవో మహేశ్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బొంపల్లి ఎంపీటీసీ రాములు

ఎమ్మెల్యేతో ఎంపీ భేటీ



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు: మార్చి 18: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సోమవారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. ఆయనవెంట నాయకులు పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, అబ్దుల్ రవూఫ్ ఉన్నారు.

లంచం డిమాండ్ చేసిన ఉద్యోగి సస్పెన్షన్

కీసర, మార్చి 18: లంచం డిమాండ్ చేసిన ఉద్యోగిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. కీసర తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి పథకానికి లబ్ధిదారుల వద్ద లంచం డిమాండ్ చేశారని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్‌దిప్రెస్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఓ విలేకరిని ప్రశ్నించిన విషయం తెలిసిందే. కాగా ఇట్టి విషయంపై ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి విచారణ చేపట్టారు. భోగారం గ్రామానికి చెందిన రేణుకా అనే మహిళ కొన్ని రోజుల కిందట కల్యాణ లక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకోవడానికి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చింది. దీంతో కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ రమేష్ రేణుకను లంచం డిమాండ్ చేసినట్లు తమ విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయగా సోమవారం మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ జూనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రమేష్ గతంలో కామారెడ్డిలో వీఆర్‌ఏ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా మార్పు చేసి కీసర తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ పొందినట్లు తెలిపారు.

తల్లి, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న సీడీపీవో కాంతారావు

బంట్వారం, మార్చి 18: తల్లి, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ మర్పల్లి ప్రాజెక్ట్ సీడీపీవో కాంతారావు అన్నారు. మండలంలోని బాపునారంలో సోమవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ధనలక్ష్మి, అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, యశోద పాల్గొన్నారు.

కులకచర్ల: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని పరిగి సీడీపీవో ప్రియదర్శిని తెలిపారు. కులకచర్లలో సోమవారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, పద్మ, మండల సూపర్‌వైజర్ యాదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.


సొంత గూటికి బాలేశ్వర్ గుప్తా



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా


తాండూరు: మార్చి 18: తాండూరులో బీఆర్‌ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. యాలాల ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా సోమవారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. గతంలో బీజేపీలో పని చేసిన బాలేశ్వర్‌గుప్తా తర్వాత కాంగ్రెస్ నుంచి ఎంపీపీగా ఎన్నికై బీఆర్‌ఎస్‌లో చేరారు. తిరిగి సోమవారం సొంతగూటికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం ఉన్నారు.














వైభవంగా శ్రీమల్లికార్జునస్వామి జాతర




స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

శామీర్‌పేట, మార్చి 18: శామీర్‌పేటలోని మల్లికార్జున స్వామి జాతర, కల్యాణోత్సవాన్ని సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమల్లికార్జున స్వామి వారిని ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు, వివిధ పార్టీల నాయకులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అదేవిధంగా మధ్యాహ్నం స్వామివారి కల్యాణం, భక్తుల కోలాహలం మధ్య బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలతో కనుల పండువగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు, ఓడిబియ్యం, బోనాల ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం శామీర్‌పేట మాజీ సర్పంచ్ కిశోర్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ సాయిబాబు, వివిధ పార్టీల నాయకులు వజ్రేష్‌యాదవ్, విక్రమ్‌రెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, ఎనుగు సుదర్శన్‌రెడ్డి, బుద్ధి శ్రీనివాస్, వైఎస్‌గౌడ్, ముజీబుద్దీన్, అశోక్, వివిధ గ్రామల నాయకులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలను నిర్వహించారు. అనంతరం వారిని యాదవసంఘం నాయకులు సన్మానించారు.

నేటి నుంచి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పరిగి, మార్చి 18: పరిగిలోని బాలాజీనగర్‌లో వెలసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి 19, 20, 21 తేదీల్లో మూడు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. విశాలమైన ప్రదేశంలో ఆలయప్రాంగణంలో ప్రతీ ఏడాది స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ జాతర ప్రతీ ఏడాది పాల్గుణ మాసంలో మూడు రోజుల పాటు ఘనంగా జరుగుతాయి. ఈ ఆలయాన్ని నిర్మించి 37ఏళ్లు పూర్తయింది. గతంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగేవి. అయితే ఈసారి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈసారి పెద్దఎత్తును నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొడంగల్ చౌరస్తాలో గల విశాల స్థలంలో స్వామివారి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణం ముస్తాబైంది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో తిరుమల తిరుపతి దేవాలయం వారు కల్యాణ మండపాన్ని నిర్మించారు. ఈ బ్రహ్మోత్సవాలకు పరిగి పరిసర ప్రాంత గ్రామాల నుంచి భక్తులు ఉత్సవాలకు వస్తుంటారు. జాతరకు వేల మంది భక్తులు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కోరిన కొర్కెలు తీర్చే వెంకన్నగా పేరుగాంచిన ఈ ఆలయం ఉత్సవాలకు అధికసంఖ్యలో భక్తులు రావడం విశేషం. ఇక్కడ ఉత్సవాలకు ప్రత్యేక దుకాణాలు వెలుస్తాయి. ఈ మూడురోజుల పాటు ప్రత్యేక భజనలు జరుగుతాయి. ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఆలయంలో వెలసిన స్వామి, అమ్మవార్లు



పరిగిలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం

బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాల వివరాలు

మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న మంగళవారం ఉదయం 8గంటలకు గణపతి పూజ, విశ్వకేన పూజ, పుణ్యావచనం, స్వామివారికి అభిషేకం, ధ్వజారోహణం, పంచగవ్యపాశణ, గోవు పూజ, మృత్యుగ్రహణం, అంకుర్పాణం, దీక్షాదారణం, రుత్సాంగవణం, సాయంత్రం తులసి అర్చన, కుంకుమ అర్చన, సాయంత్రం ఎదురు కోళ్ళు ఉంటాయి. 20న బుధవారం ఉదయం ప్రాతకాలపూజలు, హోమాలు, అభిషేకలు, చండీ హోమం, సాయంత్రం 4గంటలకు సామూహిక కుంకుమార్చన, ఎదురుకోళ్ళు ఉంటాయి. 21న గురువారం ఉదయం వేదపారాయణం, స్వామివారికి అభిషేకాలు, హోమాలు శ్రీలక్ష్మీహోమం, శ్రీవెంకటేశ్వరహోమం, ఆంజనేయ నాగ, ధ్వజహోమం, మహాపూర్ణాహుతి, 11.45గంటలకు శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం స్వామివారి ఉరేగింపు ఉంటుంది. ప్రతీరోజు సాయంత్రం ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు అన్నదానం చేయనున్నారు.



పోషకాహారల గురించి వివరిస్తున్న అంగన్ వాడీ టీచర్లు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కడ్తాల్, మార్చి 18 : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీవో రోజా అన్నారు. కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ నీలవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీవో ముఖ్యఅతిథిగా హజరయ్యారు. పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గు రించి అంగన్‌వాడీ టీచర్లు సుగుణమ్మ, లీలావతి గర్భిణీలకు, తల్లులకు, కిశోర బాలికలకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ రాము నాయక్, అంగన్‌వాడీ టీచర్ మంజుల తదితరులు పాల్గొన్నారు

కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు పూర్తి చేయాలి



వికారాబాద్, మార్చి 18 : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సీసీ రోడ్లకు సంబంధించి, లేబర్ మొబిలైజేషన్‌కు సంబంధించి దిశానిర్దేశం చేశారు. గ్రామ పరిధి ఎన్ఆర్ఈజీఎస్ వ్యవస్థను బలోపేతం చేసి కూలీల సంఖ్యను పెంచుతూ పనులు పూర్తి చేయించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని ఇవ్వాలన్నారు. గ్రామాల్లోని చిన్న చిన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తేవాలన్నారు. ఇప్పటి వరకు పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో తప్పనిసరిగా జనరేట్ చేయాలని, ఏ మండలంలో ఏ తేదీ వరకు ఎఫ్‌టీవో జనరేట్ అయింది.. చేయాల్సిన పనులు ఎన్ని ఉన్నాయో చెక్ చేసుకొని టీఏలంతా ప్రణాళికాబద్ధంగా ఎఫ్‌టీవో జనరేట్ చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- భారీగా తరలివచ్చిన భక్తులు , నేతలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న లీలాలక్ష్మారెడ్డి, మొళ్లారి వెంకటేశ్వర శర్మ

కడ్తాల్, మార్చి 18 : కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ రామేశ్వర వీరాంజనేయ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన సీతా రామ చంద్రస్వామి, శివపార్వతులు, సరస్వతిదేవి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే వేడుకలకు ఆలయ నిర్వాహకులు లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయ క్షేత్రాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా, అలంకరించారు. భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ప్రారంభ వేడుకలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఫిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలి రోజు ప్రముఖ వేద పండితుడు మొళ్లారి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. 20న విగ్రహప్రతిష్ఠ నేపథ్యంలో ప్రముఖుల రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు కోర్పోలు కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, స్వదీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శంకర్, రామకృష్ణ, పర్వతాలు, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఆదిభట్ల, మార్చి 18 : మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రతి ఆదివారం కార్మికులకు సెలవు రోజుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిభట్ల మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్, జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్మికులను తరచూ సూపర్‌వైజర్‌లు వేధించడం సరికాదన్నారు. కార్మికులకు ప్రతి ఏటా రెండు జతల దుస్తులతోపాటు సబ్బు, నూనెల డబ్బులు అడ్వాన్స్‌గా ఇ వ్వాలని అన్నారు. కార్మికులను బదిలీ చేయడం అధికారులు తక్షణమే మానుకోవాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ ఎస్.బాలకృష్ణకు అందించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, జగన్, అనిల్, బాబు, ఊపేందర్, తులసీ తదితరులున్నారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

వికారాబాద్, మార్చి 18: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. వికారాబాద్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్పీకర్ నివాసంలో విశ్రాంత ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించేలా కృషిచేస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.



ఈము రైతుల సమస్యలపై స్పందిస్తున్న ప్రభుత్వం

షాద్‌నగర్‌అర్బన్, మార్చి 18 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహం, నాబార్డు సంస్థ ఆర్థిక సహకారంతో ఈము పక్షుల పెంపకాన్ని చేపట్టి అప్పులపాలైన ఈము రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తున్నదని ఈము పక్షుల పెంపకం దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పారు. అప్పులిచ్చిన బ్యాంకుల వత్తిడితో ఆస్థులను కోల్పోతున్న తమ సమస్యలపై రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రాలు ఇవ్వడంతో సమస్య పరిష్కారం కోసం చొరవ చూపుతున్నారని అన్నారు. ఈ మేరకు ఈనెల 14న జరిగిన బ్యాంకర్ల రాష్ట్ర స్థాయి సమావేశంలో సైతం ఈము రైతుల సమస్యలను ఇద్దరు మంత్రులు ప్రస్తావించి, సమస్యను పరిష్కరించాలని బ్యాంకర్లను ఆదేశించడంతో ఈము రైతులకు కొంత ఊరట లభిస్తున్నదని పేర్కొన్నారు. నాబార్డు ముందుకు వచ్చి ప్రతి యూనిట్‌కు 25శాతం సబ్సిడీతో 30లక్షల రూపాయల రుణం ఇవ్వడంతో తెలంగాణాలోని 118 మంది రైతులు ముందుకు వచ్చి ఈము పక్షుల పెంపకాన్ని చేపట్టారని గుర్తు చేశారు. ఈము పక్షులను పెంచిన రైతులకు ప్రభుత్వాలు మార్కెటింగ్‌ను చూపించకపోవడంతో పోషణ భారమైందని చెప్పారు. బ్యాంకర్ల ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే ఒక రైతు ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు రైతులు ఆత్మహత్యకు యత్నించారని తెలిపారు. ఈము రైతులు పది సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యపై పూర్తి అవగాహనతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు సానుకూలంగా స్పందిస్తున్నారని, సమస్య త్వరలో పరిష్కరించాలని వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు.

కనుల పండువగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం

- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు



ఆమనగల్లు అలివేలు మంగసమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఆమనగల్లు , మార్చి 18: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఆమనగల్లు పట్టణంలోని శ్రీవెంకటగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం అలివేలుమంగ సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని శోభాయామానంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం ఆవరణలో చలువ పందిర్లు ఏర్పాటుచేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి ఆమనగల్లు పట్టణంతో పాటు రంగారెడ్డి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, మహబూబ్‌నగర్ సహా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో మేళతాళాలు , వేద మంత్రాల నడుమ అర్చకులు జానకి రామయ్య, శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, శ్రీకాంతాచార్యులు, చైతన్యాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి కట్టా శాంతమ్మదేవేందర్, బికుమాండ్ల సుజాతనర్సింహ్మ, పుష్పలతసోమశంకర్, రాజేశ్వరిరాజ్‌గోపాల్, తనుశ్రీ సత్యం, జ్యోతికొండల్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. నాట్యమయూరి శాన్వి నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. ఆమనగల్లుకు చెందిన కండె సీతమ్మలింగయ్య దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోనిజయరామ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి సతీమణి గీత, ,అనిల్ కుమార్, వెంకట రమణాచారి, సంజిత్ పాండే, మల్లిఖార్జున్, ఆనంద్ లు కండె భాస్కర్, కండె సుమన్, బికుమాండ్ల పాండయ్య, పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌ను ఖాళీ చేస్తాం



రామన్నగారి మణికంఠగౌడ్‌కు కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్, వజ్రేష్‌యాదవ్

మేడ్చల్ టౌన్, మార్చి 18: రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీలో జెండా మోసేవారు ఉండరని డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠగౌడ్ సోమవారం దాదాపు 500మందితో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చేరికల బహిరంగసభకు హరివర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని సమర్దిస్తూ ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ప్రధానంగా సమీప కాలంలో బీఆర్ఎస్‌పార్టీ పూర్తిగా ఖాళీ అవుతుందని జోస్యం చెప్పారు. ఆపార్టీలో జెండా మోసేవారు కూడా ఉండబోరన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచాతప్పకుండా అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. మేడ్చల్ ప్రజలకు సుదీర్ఘకాలం పాటు సేవలందించిన మాజీ సర్పంచ్ దివంగత చిలుక రాజు తనయుడు మణికంఠగౌడ్ కాంగ్రెస్ పార్టీలో రావడం ప్రశంసనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. కనీవినీ ఎరుగని తరహాలో మణికంఠ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో పలువురు కాంగ్రెస్‌లో చేరడం అభినందనీయమన్నారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన చాలామంది తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో నాయకత్వం లేక పోవటంతో అనేక ఇబ్బందులు పడ్డామని కౌన్సిలర్ మణికంఠ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి దగ్గర నుంచి మున్సిపల్ ఛైర్‌పర్సన్ వరకు ప్రజల బాగోగులను పక్కనబెట్టి సొంత ప్రయోజనాల కోసం పని చేసేవారని ఆరోపించారు. డబ్బులతో రాజకీయం చేసే నేతలకు తగిన గుణపాఠం నేర్పాలన్న ఉద్దేశ్యంతో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణకంఠ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ సెల్‌అధ్యక్షుడు సయ్యద్ లాయక్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ రఫీక్, బీసీ నాయకుడు నడికొప్పు బాల మల్లేష్, రమేష్, నర్సింహా పార్టీలో చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల నర్సింహారెడ్డి, రమణారెడ్డి, చాప రాజు, సాయిపేట శ్రీనివాస్ యాదవ్, పోచయ్య, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలు షురూ

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పదో తరగతి వార్షికపరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి విద్యార్థులు మొదటిరోజు పరీక్షకు గంటముందే పరీక్షా కేంద్రానికి చేరుకుని పరీక్షలు రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.



పెద్దేముల్: మంబాపూర్ పరీక్షాకేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

వికారాబాద్: తొలి రోజు పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు





బొంరాస్‌పేట్: పరీక్షా కేంద్రం దగ్గర హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు



మోమిన్‌పేట్: బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



శామీర్‌పేట: తూంకుంటలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులు



పూడూరు: హాల్‌టికెట్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



మర్పల్లి: పదో తరగతి పరీక్షా కేంద్రం దగ్గర హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



దోమ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



యాలాల: జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న పదో తరగతి విద్యార్థులు



తాండూరు రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో క్యూలో వెళ్తున్న విద్యార్థులు

కురిసిన వాన.. తడిసిన నేల



మంబాపూర్‌లో రాత్రివేళ జోరుగా కురుస్తున్న వర్షం

పెద్దేముల్, మార్చి 13: భానుడి తాపం నుంచి ప్రజలకు కాస్త ఊరట లభించింది. ఇన్ని రోజులు ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సోమవారం కురిసిన వర్షం ఉపశమనాన్ని కలిగించింది. పెద్దేముల్ మండలంలో సోమవారం రాత్రి వర్షం కురవడంతో వాతారవణం కాస్త చల్లబడింది. రాత్రివేళ కురిసిన వర్షానికి జనం మురిసిపోయారు. వేసవి మొదలవడంతో ఇప్పటికే చెరువులు కుంటలు ఎండుముఖం పట్టాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వ్యవసాయబోర్లలో నీరు తగ్గిపోతోంది. ప్రస్తుతం వర్షాల అవసరం ఉందని రైతులు అంటున్నారు.

నీరు వృథా చేయొద్దు

కులకచర్ల, మార్చి 18: కుళాయిల ద్వారా నీరు వృథాగా వెళ్లకుండా ఆన్‌ఆఫ్ స్విచ్‌లు బిగించాలని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం కులకచర్ల గ్రామంలో ఆయన పర్యటించి ప్రతీ ఇంట్లో కుళాయిలను పరిశీలించారు. నీరు పట్టుకున్న తర్వాత కుళాయిలను ఆప్ చేయాలని తెలిపారు

కొబ్బరి కాయల విక్రయానికి వేలం

కులకచర్ల, మార్చి 18: బండవెల్కిచర్ల గ్రామ పాంబండ రామలింగేశ్వరస్వామి పెద్ద జాతర సందర్భంగా కొబ్బరి కాయల విక్రయానికి సోమవారం వేలం నిర్వహించారు. వేలంలో అదే గ్రామానికి చెందిన కాశమోని మల్లేశ్ రూ.5లక్షల 71వేలకు దక్కించుకున్నారు. ఈనెల 30 నుంచి ఏప్రిల్ 10 వరకు పెద్ద జాతర సందర్భంగా కొబ్బరి కాయలు విక్రయించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నర్సమ్మ రాములు, ఈవో సుధాకర్, పర్యవేక్షకులు, కార్య నిర్వాహణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌లో నాలుగు రైతు వేదికలు

వికారాబాద్, మార్చి 18: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్ జిల్లాలో నాలుగు రైతువేదికల్లో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సిస్టమ్ ద్వారా రైతు లకు రైతు వేదికకలో నుంచి శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు సలహాలను విని వారి సమస్యలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. కొడంగల్ బొంరాస్‌పేట, తాండూరు యాలాల్, వికారాబాద్ మోమిన్ పేట, పరిగి పూడూరు రైతు వేదికల్లో ఈ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మంగళవారం రైతునేస్తం ద్వారా ఉదయం 10గంటల నుంచి 11.30వరకు నేరుగా వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 19వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈవారంలో వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెలుకువపై డాక్టర్ బి.శ్రీనివాస్ జగిత్యాల నుంచి, ఆయిల్ ఫామ్ సాగులో తీసుకోవాల్సిన మెళకువల గురించి డాక్టర్ రాజశేఖర్ సలహాలు ఇస్తారన్నారు. వేసవిలో సాగుచేసే కూరగాయలు వాటిపై వాడే పురుగుల మందులు, అవశేషాలపై రైతులకు వివరిస్తారని తెలిపారు. రైతులు తమ రైతు వేదికల వద్ద ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

శ్రీమల్లికార్జున చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు

తాండూరురూరల్, మార్చి 18: తాండూరు మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామ శివారులో శ్రీమల్లికార్జున చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుకు సోమవారం శ్రీకారం చుట్టారు. కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ జిల్లా షాపూర్ తాలూకా, మాల్‌రేజా గ్రామానికి చెందిన శ్రీమల్లికార్జున ముత్య(అప్పాజీ) తాండూరును సందర్శించి గుడి నిర్మాణానికి ధర్మీది కుటుంబీకులు కొన్ని గుంటల భూమిని ట్రస్ట్ పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అట్టి కార్యక్రమానికి మల్లికార్జునముత్య(అప్పాజీ) హాజరయ్యారు. ఆశ్రమం పేరిట భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అట్టి స్థలంలో త్వరలోనే తాండూరు ప్రాంత ప్రజానీకానికి సేవలందించేందుకు హనుమంతరాయ మందిర వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి భక్తులకు దర్శభాగ్యం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్మీది కుటుంబీకులతోపాటు తాండూరు ప్రాంతానికి చెందిన భక్తులు, బీజేపీ నాయకులు పూజారి పాండు పాల్గొన్నారు.

మద్యం మత్తులో అంగన్‌వాడీ ఆయా

● నిలదీసిన గ్రామస్తులు ● అధికారులకు ఫిర్యాదు

బషీరాబాద్, మార్చి 18: మద్యం మత్తులో వచ్చిన అంగన్‌వాడీ ఆయాను తాండావాసులు నిలదీశారు. ఈ ఘటన బషీరాబాద్ మండలం బద్లాపూర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగింది. తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి సమీప గ్రామం కాశీంపూర్ నుంచి టీచర్, ఆయా అనంతమ్మ వస్తారు. మూడు రోజులుగా టీచర్ అనారోగ్యానికి గురై రావడం లేదని తెలిసింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం కేంద్రానికి వచ్చిన ఆయా మద్యం తాగి వచ్చి అంగన్‌వాడీ కేంద్రం మెట్లపై కూర్చుంది. అప్పటికే అక్కడికి వచ్చిన చిన్నారుల తల్లిదండ్రులు మత్తులో ఉన్న ఆయాను ఇదేమని అడుగగా అరుస్తూ గొడవ పెట్టుకుంది. దీంతో వారితో గొడవకు దిగగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కేంద్రానికి చేరుకుని సూపర్‌వైజర్లు విచారణ జరిపారు.

జిల్లా సరిహద్దులో చెక్‌పోస్టుల ఏర్పాటు



కరణ్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చెక్ పోస్టు

వికారాబాద్, మార్చి 18: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయనున్నట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లాకు ఇతర రాష్ట్రాలతో సరిహద్దు కలిగిన ఇంటర్‌స్టేట్ బార్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో చంద్రకల్, కస్తూర్‌పల్లి, మైల్వార్, ఇందర్చేడి, నవాంగి, కొత్లాపూర్ బొప్పునారం ప్రాంతాల్లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని చెక్‌పోస్టుల్లో నిరంతరం వాహనాల తనిఖీలు సీసీటీవీల పర్యవేక్షణలో తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. రూ.50వేల కన్నా ఎక్కువ నగదును కలిగి ఉంటే దానికి సంబంధించిన రసీదులు కలిగి ఉండాలని, లేదంటే డబ్బును సీజ్‌చేసి సంబంధిత అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. అదేవిధంగా ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ కృష్ణకుమార్ కుటుంబసభ్యులకు ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ తరపున రూ.50వేల చెక్కును ఆర్ఐ డేవిడ్ విజయ్‌కుమార్‌లు పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ చేతుల మీదుగా అందజేశారు.

కొడంగల్ రూరల్: ఎన్నికల కోడ్ అమలు కావడంతో కొడంగల్ మండలంలోని కస్తూర్‌పల్లి, రావుల్‌పల్లి చెక్‌పోస్టులను కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి తనిఖీ చేశారు. సోమవారం ఎస్సై భరత్‌రెడ్డి, పోలీసు సిబ్బందితో చెక్‌పోస్టులను తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. కొడంగల్ ప్రాంతం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రూ.50వేల కంటే ఎక్కువగా తీసుకెళ్తూ పట్టుబడితే సీజ్‌చేస్తామని తెలిపారు.

తాండూరు రూరల్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్ వద్ద ఇంటర్‌స్టేట్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం కర్ణాటక ప్రాంతం నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ అశోక్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఆర్ పోలీసులు ఉన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



ఎల్లకొండలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, మార్చి 18: మండలంలోని ఎల్లకొండలో సోమవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు.కల్యాణ మహోత్సవంలో పటాన్‌చెరువుకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, పట్లోళ్ల దేవేందర్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ పామెన భీమ్‌భరత్, ఆలయ కమిటీ చైర్మన్ పట్లోళ్ల భరత్‌రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, కార్యదర్శి సామ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కొంశెట్టిపల్లిలో బీరప్ప జాతర

మర్పల్లి: కొంశెట్టిపల్లి గ్రామంలో బీరప్ప జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతర ఉత్సవాలకు ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు రఫీయోద్దీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

సోమారంలో మల్లన్న జాతర

మేడ్చల్‌టౌన్: సోమారం గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి వారి జాతర ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవ వేడుకల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. అగ్నిగుండాలు, ఒగ్గుకథతో పాటు సాయంత్రం మహిళలు బోనాలతో ఊరే గింపు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, ఎంపీటీసీ కుమార్‌లు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి వెల్చాల్‌లో బ్రహ్మోత్సవాలు

మోమిన్‌పేట్: వెల్చాల్‌లో గల శ్రీలక్ష్మీ నరసిహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని మొదటి రోజు ధ్వజారోహణం, బోనాలు, పల్లకీసేవ, భజనలు, బుధవారం రథోత్సవం, భజనలు, గురువారం వేదబ్రాహ్మణుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవం, అన్నదానం, పెరుగు బసంతం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలనుకునే దంపతులు 9963254810, 9866389889 సెల్‌నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

ఎంఈవోపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

మర్పల్లి, మార్చి 18: ఎంఈవోపై దాడిచేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మర్పల్లి ఎంపీడీవో రాచమల్లయ్య, ఎంపీవో సుశీల్‌కుమార్ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరులో ఎంఈవోపై ఎంపీపీ దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మండల ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. అధికారుల విధి నిర్వాహణలో అడ్డు పడటంతో పాటు దాడులకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మోహన్‌రావు, మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

పరిగి, మార్చి 18: జడ్పీహెచ్ఎస్ చిట్యాల్ కాంప్లెక్స్‌లో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏడు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు చేయనున్నట్లు ఏవో తిప్పేస్వామి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు క్షేత్రస్థాయిలో పంటల సాగుపై సలహాలు, సూచనలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● **పూడూరు:** పూడూరు మండల కేంద్రంలోని రైతువేదికలో నేడు(మంగళవారం) రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం పేర్కొన్నారు. ఉదయం 9.30గంటల నుంచి 11.30 గంటల వరకు శాస్త్రవేత్తలతో ఈ వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుందని తెలిపారు. వరి పంట, కూరగాయల తోటల్లో దిగుబడి తగ్గుదల, తెగుళ్లు, చీడపీడల నియంత్రణ, నిర్వహణ, పామ్ ఆయిల్ తోటలో తీసుకోవాల్సిన చర్యలు, తదితర సమస్యలపై రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో నేరుగా శాస్త్రవేత్తలకు వివరించి పరిష్కారాన్ని తెలుసుకోవచ్చని వ్యవసాయాధికారి పేర్కొన్నారు.

● **శామీర్‌పేట:** గ్రామసభలో ప్రజలు తెలిపిన సమస్యలను తాము బాధ్యతగా పరిశీలించి సాధ్యమైనంత త్వరలో పరిష్కారచర్యలను తీసుకుంటామని శామీర్‌పేట గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం శామీర్‌పేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ ఎల్లుబాయి, ప్రత్యేకాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యదర్శి మౌనిక గ్రామసభను నిర్వహించారు. గ్రామంలో రోడ్లను, డ్రైనేజీలను నిర్మించాలని, శామీర్‌పేట దర్గా వద్ద రాజీవ్‌రహదారిలో ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్లను ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించాలని ప్రత్యేకాధికారికి విన్నవించారు.

● **బషీరాబాద్:** ఎక్మాయి గ్రామానికి చెందిన రాములమ్మ(70) ఆదివారం రాత్రి మృతి చెందింది. క్రమంలో రాములమ్మకు సొసైటీలో సభ్యత్వం ఉండటంతో అంత్యక్రియాల కోసం కుటుంబీకులకు సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి తరఫున సాయం అందజేసినట్లు సొసైటీ సీఈవో బందెయ్య తెలిపారు.

● **ఘట్‌కేసర్:** ప్లాట్లను తొలగించి తిరిగి లేఅవుట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం సదాతాలీగూడ వాసులు బింగి మల్లేష్‌గౌడ్, బింగి సురేష్‌గౌడ్, బింగి గవాస్కర్‌గౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చౌదరిగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన సదాతాలీగూడ రెవెన్యూ సర్వేనంబర్ 715లో గతంలో అవుట్ చేయగా అందులో ప్లాట్లు కొనుగోలు చేసామన్నారు. కొందరు కబ్జాదారులు ప్లాట్ల హద్దురాళ్లను తొలగించి, తిరిగి లేఅవుట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా స్పందించి అక్రమార్కుల నుంచి తమ ప్లాట్లను సంరక్షించాలని కోరారు.

● **శామీర్‌పేట:** తూంకుంట పరిధిలోని పెద్ద చెరువుకు చెందిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాన్ని సోమవారం అధికారులు పరిశీలించి సమగ్ర సర్వే జరిపి హద్దులను ఏర్పాటు చేశారు. డిప్యూటీ ఇరిగేషన్ శాఖకు చెందిన జిల్లా డిప్యూటీ ఇంజనీర్ సురేష్, ఏఈ ప్రశాంత్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమార్, మండల సర్వేయర్ యాదగిరి, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్, సిబ్బంది కలిసి తూంకుంట పెద్ద చెరువుకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లకు సర్వే జరిపి హద్దులను ఫిక్స్‌చేసి రాళ్లను ఏర్పాటు చేశారు.

● **ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మండల పరిధిలోని చౌదరిగూడ గ్రామ పంచాయతీ బిల్‌కలెక్టర్ కోరుబోతు గోపాల్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. బుధవారం హైబీపీతో ఆసుపత్రిలో చేరిన గోపాల్‌కు వైద్యులు పరీక్షలు నిర్వహించి మెదడులో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించి శస్త్రచికిత్స చేశారు. ఉన్నట్టుండి బుధవారం ఆరోగ్యం విషమించి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా 1992లో ప్రతాపసింగారం బిల్‌కలెక్టర్‌గా ప్రస్తానం ప్రారంభించిన గోపాల్ అనంతరం బోడుప్పల్, అక్కడి నుంచి చౌదరిగూడకు బదిలీపై వచ్చాడు. అతడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

● **పరిగి:** డీసీసీ అధ్యక్షుడు,పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో చేవెళ్ల ఎంపీ జి.రంజిత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ నుంచి చేవెళ్ల ఎంపీగా గెలిచిన రంజిత్‌రెడ్డి ఆదివారం కాంగ్రెస్‌లో చేరిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న రామ్మోహన్‌రెడ్డిని కలిసి సన్మానించారు.

● **పరిగి:** పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల 1996-98 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు బుధవారం మండల పరిధిలోని చిట్యాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా వాటర్ బాటిల్స్ అందజేశారు. పాఠశాలలోని 69 మంది విద్యార్థులకు బాటిళ్లను పంపిణీచేశారు. పాఠశాల హెచ్ఎం ఎండీ ఉస్మాన్‌అలీ, సంఘం కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్, సంఘం నాయకులు కె.వీరారెడ్డి, జమాల్‌ఖాన్, వెంకటేశ్, మోహన్, శ్యామ్‌సుందర్, జమున, అనురాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌కు చెందిన 30మంది బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ అధ్యక్షుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు శామీర్‌పేట్ మండలంలోని ఈటల రాజేందర్ నివాసానికి తరలి వెళ్లారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య

పూడూరు, మార్చి 18: గుర్తుతెలియని వ్యక్తులు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన పూడూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మన్నెగూడకు చెందిన హరిజన సంజయ్, దోమ మండలం బొంపల్లి గ్రామానికి చెందిన అనితతో 14ఏళ్ల కిందట వివాహమైంది. ఆదివారం రాత్రి ఎన్కేపల్లి గ్రామ శివారులోని జిందాలి లస్మత్ ఫార్మ్‌లాండ్ గేటు వద్ద సంజయ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు బలమైన ఆయుధంతో తలపై కొట్టారు. దీంతో తీవ్ర రక్తస్రావమై సంజయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి పద్మమ్మ తన కుమారుడు సంజయ్‌ని గోపాల్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి కారులో తీసుకెళ్లాడని, అతడిపైనే అనుమానం ఉందని చెన్‌గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి విచారణ చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు పరిగి డీఎస్పీ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ట్యాంకర్ డ్రైవర్ మృతి

● పెట్రోల్ బంక్ నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు

కీసర రూరల్, మార్చి 18: విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో ట్యాంకర్ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన నాగారం మున్సిపల్ పరిధి ఎస్వీనగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండలానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(50) నగరంలోని కాటేదాన్‌లో నివాసముంటున్నాడు. నాగారం మున్సిపాలిటీ పరిధి ఎస్వీనగర్‌లోని హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ట్యాంకర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కాగా ఆదివారం హెచ్‌పీ పెట్రోల్ బంకుకు ట్యాంకర్ ద్వారా డీజిల్‌ను తీసుకువచ్చాడు. ట్యాంకర్‌ను ఖాళీచేస్తూ ట్యాంకర్ పక్కనే కూర్చుని సెల్‌ఫోన్‌ను చూస్తున్నాడు. హఠాత్తుగా గుండెపోటు రావటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా పెట్రోల్ బంకు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే శ్రీనివాస్‌రెడ్డి మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు పెట్రోల్ బంక్ వద్ద కొద్దిసేపు ఆందోళన చేశారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

మూడుచింతలపల్లి, మార్చి 18: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొల్తూర్ గ్రామానికి చెందిన గుర్రాల స్వామి(35) కూలి పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తుర్కపల్లి మలకపేట్ గ్రామాల మధ్యలోని మల్కచెరువు వద్దకు శనివారం సాయంత్రం తన స్నేహితులు కొండ అశోక్, దొరవారి కృష్ణలతో కలిసి వెళ్లాడు. తిరిగి ఇంటికి ఇద్దరు మాత్రమే వచ్చారు. గుర్రాల స్వామి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మల్క చెరువులో స్వామి మృతదేహం తేలియాడటంతో స్థానికులు అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకుని ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తూ స్వామి మృతదేహంతో కొండ అశోక్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు

మూడుచింతలపల్లి, మార్చి 18: పేకాడుతున్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు శామీర్‌పేట పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. శామీర్‌పేట్‌లోని ఓ రిసార్ట్‌లో పేకాట స్థావరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. ఈదాడిలో ఎనిమిది మందిని పేకాడుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.41వేల నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని శామీర్‌పేట్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ తరలింపు

● ట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు

పెద్దేముల్, మార్చి 18: కర్ణాటక నుంచి అక్రమంగా డీజిల్ తీసుకువస్తున్న ట్రాక్టర్‌ను పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన పి.రవీందర్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో కర్ణాటకలోని కుంచారం గ్రామం నుంచి పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామానికి డీజిల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నాడు. ట్రాక్టర్‌లో 2వేల లీటర్ల డీజిల్ అక్రమ రవాణా చేస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ఆశిష్, పెద్దేముల్ పోలీసులతో కలిసి దారికాచి పట్టుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌తో పాటు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలిపారు.

వ్యక్తి మృతి కేసులో అన్నా, వదినల రిమాండ్

తాండూరురూరల్, మార్చి 18: సిరిగిరిపేట్ గ్రామానికి చెందిన పరుశురాం ఉరేసుకుని మృతిచెందిన కేసులో ఆయన అన్న పాండు, వదిన నాగమ్మల ప్రమేయం ఉన్నట్లు తమ విచారణలో తేలిందని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. పరుశురాం మృతికి కారణమైన పాండు, నాగమ్మలను సోమవారం కోర్టులో హాజరు పరిచి పాండును పరిగి జైలుకు, నాగమ్మను చంచల్‌గూడ జైలుకు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు.. ఇద్దరి అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరిని ఎస్‌వోటీ, ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టుచేసి జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపల్, కొండాపూర్ విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వం నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ పాల్పడుతుండగా ఎస్‌వోటీ, ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం దాడిచేశారు. బ్లాస్టింగ్‌కు పాల్పడిన పోచంపల్లి మండలం దేశ్‌ముఖ్ గ్రామానికి చెందిన ఆలకుంట మల్లయ్య(50), యాదయ్య(56)లను అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారయ్యాడు. 16 జిలెటిన్ స్టిక్స్, 19 డిటోనేటర్‌లు, టాటా హిటాచ్చి, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోచారం ఐటీసీ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపల్‌లోని ఓ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఇంటిపై దాడిచేశారు. ఇంట్లో 53 మద్యం సీసాలు పట్టుబడినట్లు తెలిపారు. ఈ మేరకు కుమార్‌గౌడ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లోని కొండాపూర్‌కు చెందిన కొంపల్లి వెంకటేష్ కిరాణషాప్‌లో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న విషయం తెలుసుకుని సీఐ ఎస్.సైదులు దాడిచేశారు. 20మద్యం సీసాలతో పాటు రూ.3960 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ

మోమిన్‌పేట్, మార్చి 18: సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రేస్ చేసి రికవరీ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ అరవింద్ సోమవారం మోమిన్‌పేట్ మండలంలోని కాసులబాద్ గ్రామానికి చెందిన వెంకట్‌కు ఫోన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుమో బోల్తా.. పలువురికి గాయాలు

బొంరాస్‌పేట్, మార్చి 18: హైదరాబాద్‌లోని సన్‌సిటీ కాలనీకి చెందిన పలువురు సుమో వాహనంలో బషీరాబాద్ మండలం ఎక్మై గ్రామానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్తుండగా తుంకిమెట్ల సమీపంలో గల ఓ దాబా దగ్గర ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని డ్రైవర్ ఓవర్ టెక్ చేస్తుండగా సుమో వాహనం బోల్తాపడింది. ఈ సంఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.